నమస్తే తెలంగాణ
జనగామ
5 | మంగళవారం 14 మే 2024 | JANAGAON

ఓటు వేసి సిరా చుక్క చూపుతున్న యువతి

ములుగు జిల్లాలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

పోలింగ్.. ప్రశాంతం

వరంగల్ సెగ్మెంట్‌లో 64.08 శాతం నమోదు

మహబూబాబాద్‌లో 70.68 శాతం

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో అత్యధికంగా 74.64
- నాలుగు చోట్ల రాత్రి 9 వరకు పోలింగ్

వాజేడు: గుట్టపై నుంచి 16 కి.మీ కాలినడకన ఓటు వేసేందుకు వస్తున్న పెనుగోలు గ్రామస్తులు

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వరంగల్, మహబూబాబాద్ సెగ్మెంట్లలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాంకేతిక సమస్యలతో ఈవీఎంలు మొరాయించడంతో పాటు స్వల్ప ఘటనలతో పలుచోట్ల పోలింగ్ ఆలస్యమైంది. మధ్యాహ్నం మందకొడిగా ఉన్న పోలింగ్ మళ్లీ సాయంత్రానికి పుంజుకున్నది. పల్లె జనం ఓటేసేందుకు ఉత్సాహం చూపగా పట్టణాల్లో కాస్త మందకొడిగా సాగింది. మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, వరంగల్ తూర్పులో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. కాగా వరంగల్‌లో 64.08 శాతం, మహబూబాబాద్‌లో 70.68 శాతం నమోదైంది. ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగలో అందరూ భాగస్వాములు కాగా తొలి ఓటర్లతో పాటు వృద్ధులు, దివ్యాంగులు చైతన్యంతో ఓటేయడం కనిపించింది. ఈ సందర్భంగా ఓటేసిన యువత అక్కడున్న ఓటర్స్ సెల్ఫీ జోన్‌లో 'ఐ కాస్ట్ మై వోట్' అంటూ సెల్ఫీలు, ఫొటోలు దిగి సోషల్ మీడియాలో పంచుకొని మురిసిపోయారు.

- వరంగల్, మహబూబాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ)

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అధిక శాతం పోలింగ్ నమోదైంది. పరకాల నియోజకవర్గం రెండోస్థానంలో ఉంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, గ్రామీణ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో 9గంటల తర్వాత పోలింగ్ కేంద్రాలకు రావడం మొదలైంది. దీంతో మొదటి రెండు గంటల్లో 8.97 శాతం మాత్రమే నమోదైంది. 11 గంటల వరకు 24.48 శాతానికి చేరింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 41.23 శాతానికి పెరిగింది. మధ్యాహ్నం 3గంటలకు 54.17 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 64.08 శాతం నమోదైంది. సాయంత్రం 5గంటల వరకు నమోదైన పోలింగ్‌ను పరిశీలిస్తే అత్యధికంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 74.64 శాతం, పరకాలలో 70.20, పాలకుర్తిలో 68.41, వర్ధన్నపేటలో 66.43, భూపాలపల్లిలో 65, వరంగల్ తూర్పులో 59.43, వరంగల్ పశ్చిమలో 47శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయిలో బందోబస్తును పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య మానిటరింగ్ చేశారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తూ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. బందోబస్తు మధ్య ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పోలింగ్ అధికారులు, సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రాలకు తరలించారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో మొత్తం 1809 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించగా అధికారులు వాటిని సరిచేసి పోలింగ్ ప్రక్రియను కొనసాగించారు. నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామంలో 55 ఏళ్ల వృద్ధురాలు ఓటు వేసి వచ్చి ఇంటి వద్ద గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందింది. మరిపెడ మండలం చింతగట్టు తండాలో 450 ఓట్లు ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయలేదని ఓట్లు వేయకుండా ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు అక్కడికి వెళ్లి వారిని సముదాయించారు.

ఓటు వేసి సిరా చుక్క చూపుతున్న ఎంపీ అభ్యర్థులు మాలోత్ కవిత, సుధీర్‌కుమార్, నీతారాంనాయక్, అరూరి రమేశ్, కడియం కావ్య, శ్రీహరి తదితరులు

ఓటు వేసినట్లు చూపుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు

ఓటు వేసి సెల్ఫీ తీసుకుంటున్న వృద్ధులు, ఓటేసినట్లు చూపుతున్న చిరు వ్యాపారి

జనగామలో ఉద్రిక్తత

- అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు కాంగ్రెస్ నేత ప్రశాంత్‌రెడ్డి యత్నం
- అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలతో వాగ్వాదం
- పోలీసుల తీరుపై పల్లా ఆగ్రహం

ప్రశాంత్‌రెడ్డిని నిలదీస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ, మే 13 (నమస్తే తెలంగాణ) : జనగామలోని ధర్మకంచ పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ నాయకులు రావడం ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేకున్నా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రావడంతో బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. పోలింగ్ కేంద్రంలోకి ఎలా అనుమతించారంటూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఏసీపీ అంకిత్, అర్బన్ సీఐ రఘుపతిరెడ్డిని నిలదీశారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల నడుమ తోపులాట జరిగింది. ఏసీపీ అంకిత్‌కు ఎమ్మెల్యే పల్లా నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో తనను చేతులతో నెట్టి వేసేందుకు యత్నించిన ఏసీపీపై 'డోంట్ టచ్' అంటూ ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా, పోలీసు అధికారులు కాంగ్రెస్‌కు వంతపాడుతూ ఏకపక్ష ధోరణితో వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గానుగుపహాడ్‌లో సైతం ఓటేసేందుకు రోడ్డుపై ఉన్న ప్రజలపై అర్బన్ సీఐ అకారణంగా లాఠీచార్జి చేశారని మండిపడ్డారు. ఈ ఘటనపై ఎన్నికల సంఘానికి, జిల్లా ఎన్నికల అధికారి, సీపీ, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

పరకాలలో కాంగ్రెస్ గూండాల దౌర్జన్యం

- తొమ్మిది మందిపై కేసు నమోదు

నమస్తే నెట్‌వర్క్ : పరకాలలో పోలింగ్ సరళిపై చర్చించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో నాగయ్య, రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏరుకొండ శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. అకారణంగా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగడంతో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవిరాజు తెలిపారు. గాయపడిన వారిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.

మొరాయించిన ఈవీఎంలు.. పోలింగ్ ఆలస్యం

వరంగల్, మహబూబాబాద్ సెగ్మెంట్లలో చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. పలుచోట్ల అధికారులు సరిచేసి పోలింగ్‌ను కొనసాగించగా మరికొన్ని కేంద్రాల్లో గరిష్ఠంగా రెండు గంటల సమయం పట్టడంతో ఓటర్లు ఇబ్బంది పడాల్సి వచ్చింది. బయ్యారం మండలం వెంకట్రాంపురంలోని జడ్పీ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి గుర్తుపై సిరా చుక్క అంటించడంతో గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. నెల్లికుదురు మండలం హేమ్లతండాలోని 160వ పోలింగ్ బూత్‌లో ఓటు వేస్తూ వీడియో తీసి వాట్సాప్‌లో పోస్టు చేసిన ఇస్రతండాకు చెందిన బానోత్ బాలకృష్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంగెం మండలం ఎల్గూరు స్టేషన్ బూత్‌లో ఓటు వేసి సెల్ఫోన్‌లో వాట్సాప్‌లో వైరల్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అధికారులతో యువకులు వాగ్వాదానికి దిగారు.